క్లుప్తంగా

అలరించిన చిందు యక్షగాన ప్రదర్శన



వర్ధన్నపేట : పట్టణంలోని మూడో వార్డులో గజవెల్లి వెంకన్న బృందం మంగళవారం నిర్వహించిన చిందు యక్షగాన ప్రదర్శన అలరించింది. కళాకారులు శశిరేఖ పరిణయం నాటిక ప్రదర్శించిన ఆహూతులను ఆకర్షించారు. నాటికలోని పాత్రదారుల హావభావాలు, సన్నివేశాలు, యక్షగానం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పదర్శనను తిలకించారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి



చేరాలు (ఫైల్)

సంగెం : గుండెపోటుకు గురై ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన మెట్టుపల్లి చేరాలు (60) ఉపాధి హామీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఊరచెరువులో పూడిక తీత పనికి వెళ్లాడు. అనంతరం టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) రమేశ్‌తో గత వారానికి సంబంధించిన కొలతలు చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. కొద్ది సేపటికి గుండెపోటుకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన ఇద్దరిపై కేసు

సంగెం : భూవివాదంలో దూషించి ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎల్గూర్ స్టేషన్‌కు చెందిన గుగులోత్ వీరూ, తిరుపతి, వెంకటేశ్వర్లు అన్నదమ్ములు. వీరికి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి పంపకంలో తగాదాల నేపథ్యంలో తిరుపతి భార్య విజయ, కుమారుడు గోపీని ఈనెల 25న పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించారు. ఈ క్రమంలో గోపీని వీరూ, వెంకటేశ్వర్లు అవమానించేలా దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోపీ ఇంట్లోకి వెళ్లి అందరి ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గోపీని కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. గోపీ తల్లి విజయ ఫిర్యాదు మేరకు వీరూ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌కు చెందిన పెరుమాండ్ల కుమారస్వామి చిట్టీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలుపుతూ పలువురు బాధితులు వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్‌సింగ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 13న ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని బాధితులు తెలిపారు. సుమారు రూ.1.50 కోట్ల చిట్టీ డబ్బులతో పెరుమాండ్ల కుమారస్వామి కుటుంబ సమేతంగా పరారయ్యాడని పేర్కొన్నారు. కుమారస్వామిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు డబ్బులు ఇప్పించాలని కోరారు.

ఫీడర్ ఛానల్ పూడ్చివేతపై..

సంగెం : మండలంలోని వెంకటాపూర్‌లో కరుణాపురం నుంచి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫీడర్ ఛానల్ పూడ్చివేతపై పంచాయతీ కార్యదర్శి అనూష పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 24న ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫీడర్ ఛానల్‌ను గ్రామానికి చెందిన న్యాల శ్రీనివాస్, రాజు, అశోక్ ట్రాక్టర్ పెట్టి పూడ్చివేయగా అక్రమంగా పూడ్చి వేసిన ఫీడర్ ఛానల్‌ను పునరుద్ధరించేలా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదులో కోరారు. ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లికి చెందిన యాట రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) బాధ్యులు మంగళవారం పరామర్శించారు. తొలుత రవి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, చిరంజీవి, మండల అధ్యక్షుడు ఓరుగంటి తిరుపతి, కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలి

హనుమకొండ (దామెర) : స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా వైద్యాధికారి అప్పయ్యకు మంగళవారం హనుమకొండలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్‌రెడ్డి, బత్తుల సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుమడులతో పసుపు సాగు మేలు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి





దుగ్గొండి : నూతన సాగు పద్ధతులు పసుపు రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి. ఎత్తుమడులతో సాగు అధిక దిగుబడులను ఇస్తోంది. పసుపు బోర్డు అందుబాటులోకి రావడంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. మార్కెట్‌లో ఎండు పసుపు ధర ఎక్కువగా ఉండటంతో పల్లెల్లో విత్తన పసుపుకు డిమాండ్ పెరిగిందని చెప్పక తప్పదు. బెడ్ పద్ధతిలో ఎత్తుమడుల సాగు విధానాన్ని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి వివరించారు.

నేల తయారీ

వేసవిలో లోతు దుక్కులు చేసుకున్న తర్వాత భూమిని రోటోవేటర్‌తో చదును చేయాలి. ఎకరాకు 2 క్వింటాళ్ల సూపర్ పాస్ఫేట్, 2.50 క్వింటాళ్ల వేప పిండికి 2 కిలోల సూడామోనాస్ మందు కలిపి దుక్కిలో వేసి ట్రాక్టర్‌తో బెడ్‌లను సిద్ధం చేయాలి.

బెడ్ పద్ధతిలో ఎకరాకు 3 క్వింటాళ్ల విత్తనం

సాధారణ పద్ధతిలో పసుపు సాగు చేస్తే ఎకరాకు 10 క్వింటాళ్ల విత్తనం అవసరం. బెడ్ పద్ధతిలో సాగు చేసే రైతులు తొలుత పసుపు దుంపలను చిన్నపాటి ముక్కలుగా కత్తిరించాలి. వాటిని బెడ్‌పై 6 అంగుళాల ఎడంతో త్రిభుజాకారంలో విత్తాలి. తద్వారా 3 క్వింటాళ్ల విత్తన దుంపలు సరిపోతాయి.



ట్రాక్టర్‌తో బెడ్‌లు తయారు చేస్తున్న రైతు

విత్తన శుద్ధి

ఎకరాకు సరిపోయే పసుపు దుంపలకు 250 గ్రాముల రెడోమిల్, 250 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మందును నీటిలో కలిపి దుంపలను 20 నిమిషాలు నానబెట్టి తదనంతరం 48 గంటల పాటు నీడలో ఆరబెట్టాలి. అనంతరం విత్తడానికి సిద్ధం చేయాలి. సిద్ధం చేసిన విత్తనాన్ని జూన్ 30లోగా విత్తితే మెరుగైన దిగుబడులు ఖాయం.

ఎత్తుమడులు (బెడ్) వల్ల లాభాలు

ఎత్తుమడుల వల్ల భూమి గుల్లగా మారుతుంది. వర్షాలు బాగా కురిసినప్పుడు నీరు నిల్వ ఉండకుండా కిందికి వెళ్లిపోతాయి. దీంతో దుంప కుళ్లు ఆశించదు. పసుపు మొక్కల వేర్లకు ఆక్సీజన్ బాగా అంది వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది పసుపు దుంపలు ఎక్కువగా వస్తాయి.



ఎత్తయిన బెడ్‌లపై పసుపు మొక్కలు

ఎరువులు, పురుగు మందులు, సాగునీరు..

పసుపు పంటలో ఎకరాకు 4 బస్తాల యూరియా, 3 బస్తాల పొటాశ్ వేస్తే సరిపోతుంది. మొలిచిన తర్వాత 15 రోజులకోసార ఆరు దఫాలుగా వేయాలి. అలాగే 45, 65 రోజుల వయసులో 250 గ్రాముల రెడోమిల్, 250 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలా రెండుసార్లు పిచికారీ చేస్తే సరిపోతుంది. సాగునీటిని డ్రిప్ పద్ధతిలో అందిస్తే చాలా తక్కువ నీరు సరిపోతుంది. కలుపు సమస్య కూడా ఉండదు. నేల వదులుగా ఉండి పసుపు దుంపలు ఎక్కువగా సాగి మంచి దిగుబడి వస్తుంది.

దిగుబడి

సాధారణ పద్ధతిలో ఎక్కువ పంట పండినా 20 క్వింటాళ్లకు మించి ఎండిన పసుపు దిగుబడి రాదు. బెడ్ పద్ధతిలో సాగు చేస్తే ఒక్కో పాదు పసుపు దుంపకు 1–1.5 కేజీల పచ్చి పసుపు వస్తుంది. ఎకరాకు 35–40 క్వింటాళ్ల ఎండు పసుపు దిగుబడి వస్తుంది.

పంట మార్పిడితో చీడపీడల నివారణ



నల్లబెల్లి : నారక్కపేటలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీజన్

- వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త శ్రీజన్

నల్లబెల్లి : పంట మార్పిడితో భూసారం పెరగడంతోపాటు చీడపీడలను నివారణకు బాటలు పడతాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజన్ తెలిపారు. వ్యవసాయ శాఖతో కలిసి చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని మండలంలోని కన్నారావుపేట రైతు వేదికలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి శాస్త్రవేత్త శ్రీజన్ మాట్లాడారు. రైతులు యూరియా, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వినియోగం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హేమ, డాక్టర్ శరత్ చంద్ర, ఏఓ బన్న రజిత, ఏఈఓ విశ్వభాను, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

పర్వతగిరి : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని వడ్లకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో వరికి బదులు నూనెగింజలు, పప్పు దినుసులు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. పొలం గట్లపై మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.అనూష మాట్లాడుతూ పురుగు మందులను అవసరం మేరకే వాడాలన్నారు. సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే పంటలో పిచికారీ చేయాలని సూచించారు. విత్తనాలు, పురుగు మందులను కొనేటప్పుడు రశీదులు తీసుకొని పంట కాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. అన్ని సీజన్లలోనూ పంట మార్పిడి చేయాలన్నారు., తద్వారా భూసారం పెరిగి చీడపీడల నివారణకు బాటలు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇప్పించండి

- సీపీఎం జిల్లా నాయకుడు సమ్మయ్య

నర్సంపేట : నర్సంపేట డివిజన్ పరిధిలో రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు భూక్య సమ్మయ్య కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. పోడు భూములను సాగు చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు గత ప్రభుత్వం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి భూ కొలతలు చేపట్టిందని గుర్తు చేశారు. కొన్ని చోట్ల గిరిజనులకు పట్టాలిచ్చి బీసీ, ఎస్సీ, ఓసీ రైతులకు కొలతలు కొలిచి పట్టాలు ఇవ్వకపోగా కేసులు బనాయించిందని తెలిపారు. ఇప్పటికీ ఫారెస్టు శాఖ అధికారుల వేధింపులు, దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అటవీ, రెవెన్యూ శాఖల నడుమ ఉన్న భూసమస్యలను పరిష్కరించి గత ప్రభుత్వం రెవెన్యూ భూముల్లో పట్టాలు రద్దు చేసిన వారికి పట్టాలిప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బోళ్ల సాంబయ్య, ముంజాల సాయిలు, యార ప్రశాంత్, నల్లబెల్లి మండల కార్యదర్శి కడియాల మనోహర్, నాయకులు అక్కపెల్లి సుధాకర్, పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, బొడిగె సమ్మయ్య, రాజు, పెండ్యాల సారయ్య, మాంకాల శ్రీనివాస్, సర్వర్, గోనె మల్లారెడ్డి, బసికె మొగిలి, ఇండ్ల కొమ్మాలు, ఇస్లావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సమ్మయ్య, నాయకులు

ప్రణాళిక ప్రకటించడంలో నిర్లక్ష్యం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న క్రమంలో ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ విమర్శించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్‌రెడ్డి హంసారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు ప్రభుత్వంగా ఊదరగొడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆచరణలో విరుద్ధంగా వ్యవహిస్తోందని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం ప్రకటించినా కొనుగోలు చేసిన దాఖలాల్లేవని చెప్పారు. మిల్లర్లు, అధికారులు, కొనుగోలు కేంద్రాల బాధ్యులు కుమ్మక్కై రైతులను మోసగిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైనా ప్రభుత్వ యంత్రాంగం భూసార పరీక్షలు కూడా చేయించడం లేదన్నారు. కమ్యూనిస్టు ఐక్యత, వ్యవస్థాపక అధ్యక్షుడు ఓంకార్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న పార్టీ ప్రయత్నాలను ఎంసీపీఐ పేరుతో ప్రథమ మహాసభలంటూ ప్రజలను, కమ్యూనిస్టు శ్రేణులను గందగోళ పరిచేలా ద్రోహులు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గుండెబోయిన చంద్రయ్య, నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, మహ్మద్ రాజా, మాలి ప్రభాకర్, సంగం రాజన్న, ఎగ్గని మల్లికార్జున్, పెరబోయిన ఐలోని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

'జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయాలి'

వర్ధన్నపేట : ఈనెల 31న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సొట్ల నరేందర్ బాబు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు స్వీకరించిన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ సమావేశానికి రానున్న క్రమంలో ఆయనకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ ప్రజలు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మహేందర్, రామారపు శ్రీను, జన్ను రాములు, అంజయ్య, రాజు, గోపాల్, కుమార్, సంతోశ్, మల్లేశ్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ బాబు

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా..

- మాజీ సర్పంచ్‌ల ఆవేదన

ఆత్మకూరు : గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునివ్వగా మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. నీరుకుళ్ల మాజీ సర్పంచ్ అర్షం బలరామ్ , పెద్దాపూర్ మాజీ సర్పంచ్ కమల భర్త సావురే రాజేశ్వర్‌రావు, లింగమడుగుపల్లి మాజీ సర్పంచ్ రాజేశ్వరి భర్త రాజును అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అప్పు చేసి పనులు చేస్తే ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా బిల్లులు అన్ని పెండింగ్‌లో ఉంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటుందన్నారు. అక్రమ అరెస్టులతో తమను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. బిల్లులు చెల్లించే వరకు ఉద్యమిస్తామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పరకాల : ఈనెల 31న నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (హెచ్143) జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ కోరారు. పట్టణంలోని అమరధామంలో సభ వాల్ పోస్టర్‌ను యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, నాయకులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, బొమ్మగాని ఆదర్శ్, దొమ్మాటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్కూళ్ల'కు పుస్తకాలు సిద్ధం

- తొలి రోజే పంపిణీకి ఏర్పాట్లు

నల్లబెల్లి : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించేందుకు అధికారులు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు సిద్ధంగా ఉంచారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీకి పుస్తకాలు చేరుకున్నాయి. పాఠశాలలు తెరుచుకున్న మొదటి రోజే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మండల పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో 880, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 920 మంది విద్యార్థులు చదువుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. మరో 15 రోజుల్లో బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంఆర్‌సీకి 8 వేల 771 పుస్తకాలు అందాయి. మరో 10 శాతం పుస్తకాలు రావాల్సి ఉందని సమాచారం. ఆయా పాఠశాలలకు నోట్ బుక్స్ కూడా చేరుకున్నాయి. మిగతా 10 శాతం పుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి తెప్పించి దిశగా కార్యాచరణ సాగుతోంది.

యూడైస్ ఆధారంగా పుస్తకాలు..

విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందించేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. యూడైస్ ఆధారంగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఇప్పటికే 90 శాతం పుస్తకాలు ఎంఆర్‌సీకి చేరుకోగా నోట్ బుక్కులు ఆయా పాఠశాలలకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎంఈఓ ఆదేశాల మేరకు సంబంధిత హెచ్‌ఎంలకు నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. విద్యార్థుల్లో ఉత్సాహం పెంచేలా తొలిరోజే పుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేయడంలో హెచ్‌ఎంలు నిమగ్నమయ్యారు.



మండల రిసోర్స్ సెంటర్‌లో నిల్వ చేసిన పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే వసతులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, తదితర సదుపాయాలు అందుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే మొదటి రోజే విద్యార్థులకు అందించేలా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందాయి.

– అనురాధ, ఎంఈఓ

సన్మానం



వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో పాల్గొని స్వగ్రామమైన మండలంలోని ఇల్లందకు వచ్చిన జవాన్లు జెల్ల శ్రీనివాస్, సట్ల హరీశ్‌లను స్థానిక యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పత్రి భానుప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తులా రవి, ఎస్సై చందర్ మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. ఆర్మీలో విధులు నిర్వర్తిస్తూ ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

- ఎస్సై రాజు

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని ఎస్సై మెరుగు రాజు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరాల రకాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అనేక నూతన పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు అడిగే ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయొద్దని స్పష్టం చేశారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే బాధితులు ఆలస్యం చేయకుండా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శివకుమార్, కల్పన, టి.రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన కంచ శిరీశకు మంజూరైన రూ.58 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో శిరీశకు చెక్కు మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, సొసైటీ మాజీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, నాయకులు ఉప్పరి వీరస్వామి, ఉప్పరి రామచంద్రు, మొర్రి వీరస్వామి, కన్నం వెంకన్న, మండల రవి, ఉప్పరి కొమురయ్య, కన్నం కుమార్, కుండె కుమారస్వామి, భానోతు పంతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సాయం



సుష్మను సన్మానిస్తున్న బాలకిశోర్‌రెడ్డి, తదితరులు

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల సుష్మ స్వరాజ్ ఎంబీబీఎస్ విద్యాభ్యాసానికి మండలంలోని మనుగొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మంగళవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరికం నేపథ్యంలో సుష్మ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యాభ్యాసానికి సాయం అందించినట్లు తెలిపారు. తొలుత సుష్మను బాలకిశోర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. కోర్సు పూర్తయ్యే వరకు తానే ఫీజు చెల్లిస్తానని భరోసా ఇచ్చాడు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, డోలె చిన్ని, మంద రమేశ్, కూనూరు వీరభద్రం పాల్గొన్నారు.

దీక్షకు పలువురి మద్దతు



దీక్షా శిబిరంలో అరవింద్, సౌజన్య, తదితరులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట తండ్రి వాటా ఆస్తి కోసం మిట్టపెల్లి అరవింద్ చేపట్టిన దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. దీక్షకు మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్ల సురేశ్, మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి అరవిందక్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అరవింద్ సాయంత్రం తనకు రావాల్సిన సుమారు 35 గుంటల భూమిని ట్రాక్టర్‌తో దున్నించి స్వాధీనం చేసుకున్నాడు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుంది

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

పర్వతగిరి : రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని చోట్ల కొనుగోలులో జాప్యం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా చొరవ తీసుకుంటోందని తెలిపారు. కాంటా కావడం లేదని, లారీలు రావడం లేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించడంతోపాటు బోనస్ అందిస్తోందని, కాంటా అయిన రెండు, మూడు రోజులకే రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తోందని వివరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రతిరోజు మిల్లర్లు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులతో సమీక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు.